RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..



**మలుపులు తిరుగుతున్న మెట్రో**

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, జూన్ 29, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 68 | పేజీలు: 8 | వెల : రూ.1

# కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేటీఆర్



లివికారాబాద్, జూన్ 28 (వాయిస్ టుడే):లి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కార్యకర్తలకు అవగాహన కల్పించిన కేటీఆర్ , ఓటర్ల హక్కులను కాపాడే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ త్వరలో డిజిటల్ విధానంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కేటీఆర్ , పర్యాటక ప్రాధాన్యం కలిగిన వికారాబాద్ ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దామగుండంలో నేవీ రాడార్ ప్రాజెక్టు పేరిట సుమారు 12 లక్షల చెట్లను నరికివేస్తూ పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. అలాగే వికారాబాద్ నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గతంలో కాంగ్రెస్ నాయకులు కోర్టు కేసుల ద్వారా అడ్డుకున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలు, రైతులు, యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్యకర్తలు గ్రామ గ్రామానికీ, గడప గడపకూ తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేష్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలాంటి ఆటంకాలు ఎదురైనా మూసీ ప్రక్షాళన పూర్తి చేసి తీరుతా: సీఎం రేవంత్



నల్గొండ, జూన్ 28 (వాయిస్ టుడే): ఎలాంటి ఆటంకాలు ఎదురైనా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "మూసీ నది ప్రక్షాళన చేయాలన్నది నా కల. ఒట్టేసి చెబుతున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతా" అని ఆయన తేల్చిచెప్పారు. నల్గొండ జిల్లా కనగల్ మార్కెట్ యార్డులో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించిన అనంతరం, నల్గొండ పట్టణంలో తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (TUFIDC) ఆధ్వర్యంలో రూ.83 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పథకానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ (SLBC) ప్రాజెక్టును నూటికి నూరు శాతం పూర్తి చేసి నల్గొండ నేలపై కృష్ణా జలాలు పారేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీతో పాటు డిండి ప్రాజెక్టు పూర్తి చేయడానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మూసీ నది కాలుష్యం కారణంగా ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు, నల్గొండ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. "మూసీ ప్రక్షాళన చేస్తామంటే కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఎవరు అడ్డుకున్నా మూసీని ప్రక్షాళన చేసి దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. నల్గొండ ప్రజలకు కాలుష్య సమస్య నుంచి విముక్తి కల్పిస్తాం" అని అన్నారు. గత 30 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీ వేదికగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి ప్రకటించారు. తెలంగాణలో గత పదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, రాష్ట్రంలో లక్షలాది కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 3.28 కోట్ల మందికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం 30 నెలల్లో రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని, 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించామని వెల్లడించారు. వందేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు కులగణన నిర్వహించామని పేర్కొన్నారు. యువత ఉపాధి కోసం 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పించలేదని ముఖ్యమంత్రి అన్నారు. విద్యా రంగంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామని తెలిపారు. అలాగే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ATCs) అభివృద్ధి చేయడం ద్వారా యువత నైపుణ్యాలను పెంపొందించే చర్యలు చేపట్టామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే భవిష్యత్తులో వందలాది మంది అంబేద్కర్లు తయారై రాష్ట్రాన్ని నడిపించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. "ఇవన్నీ ప్రజా ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం విషయంలో మా ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలు గుర్తించి ఆలోచించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ ప్రజలు
సోమవారం, జూన్ 29, 2026

# కేంద్ర మంత్రివర్గ విస్తరణతో పాటు తెలంగాణకు న్యాయమైన హక్కులు, నిధులు, జాతీయ ప్రాజెక్టులు మంజూరు చేయాలి

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్



హైదరాబాద్, జూన్ 28 (వాయిస్ టుడే): కేంద్ర మంత్రివర్గ విస్తరణ కేవలం పదవుల పంపిణీకి పరిమితం కాకుండా, దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సమర్థవంతమైన పాలనకు, రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి దోహదపడాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కొత్త మంత్రులను నియమించడం మాత్రమే కాకుండా దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, రాష్ట్రాల అభివృద్ధి వంటి కీలక అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టులు, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కీలక మౌలిక సదుపాయాల కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, జాతీయ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలను సాధించడంలో కేంద్ర మంత్రులు విఫలమైతే వారు తమ బాధ్యతలను పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని జితేందర్ అన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం, తెలంగాణ ప్రయోజనాలను సాధించడం కేంద్ర మంత్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణకు రావాల్సిన కేంద్ర నిధులు, జాతీయ విద్యా మరియు పరిశోధనా సంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తోందని పేర్కొంటూ, దేశానికి విదేశీ పెట్టుబడులు అవసరమే అయినప్పటికీ తెలంగాణ వంటి రాష్ట్రాలు కోరుతున్న అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రజల అవసరాలు, మౌలిక వసతుల కల్పనపై కూడా అదే స్థాయిలో శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు కొత్త మంత్రుల పేర్లను కాదు, కొత్త ఫలితాలను ఆశిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణతో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు కనిపించాలని, తెలంగాణకు రావాల్సిన ప్రతి రూపాయి, ప్రతి జాతీయ ప్రాజెక్టు, ప్రతి అభివృద్ధి అవకాశాన్ని రాష్ట్రానికి అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రివర్గంలో దక్షిణ భారత రాష్ట్రాలకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణమని జితేందర్ అభిప్రాయపడ్డారు. మంత్రుల పనితీరును నిరంతరం సమీక్షించి ప్రజలకు ఫలితాలు అందించే వారికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలు ప్రకటనలు కాదు -- అమలు, అభివృద్ధి, జవాబుదారీతనాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా మిద్దెల జితేందర్ మాట్లాడుతూ, "కేంద్ర మంత్రివర్గ విస్తరణ రాజకీయ సమీకరణాల కోసం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడాలి. తెలంగాణకు మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టులు, పెండింగ్ నిధులు వెంటనే మంజూరు చేయాలి. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై గట్టిగా పోరాడాలి. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం వారి బాధ్యత. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ హక్కులు, అభివృద్ధి, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుంది" అని పేర్కొన్నారు.

# సెంటిమెంట్ విఫల వ్యూహం..జనం లైట్ తీసుకుంటున్నారా?




హైదరాబాద్, జూన్ 28, (వాయిస్ టుడే ) : తెలంగాణ రాజకీయ చిత్రపటంపై సరికొత్త వ్యూహాలు, సమీకరణాలు ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తెలంగాణ ప్రాంతీయవాదాన్ని పవన్ అవమానించారంటూ ఆయనపై దేశద్రోహం కేసులు పెట్టాలనే డిమాండ్ల వరకు కవిత వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ప్రస్తుతం తన రాజకీయ అస్తిత్వాన్ని, కొత్త పార్టీ ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చడం ద్వారా ప్రజాదరణ పొందవచ్చని ఆమె భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పొరుగు రాష్ట్ర నేత అయిన పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో, ఢిల్లీలో చేసిన కొన్ని వ్యాఖ్యలను ఆమె తనకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తున్నారు. తెలంగాణవాదులను, ప్రాంతీయ అస్తిత్వాన్ని పవన్ కించపరిచారనే భావనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా స్థానిక సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకోవాలనేది ఆమె అసలు స్కెచ్ .రాజకీయాల్లో ఒక పాపులర్ స్ట్రాటజీ ఉంది.. పెద్ద ఇమేజ్ ఉన్న నాయకుడిని లేదా సెలబ్రిటీని టార్గెట్ చేయడం ద్వారా చాలా తక్కువ సమయంలోనే వార్తల్లో నిలవవచ్చు. కవిత ప్రస్తుతం సరిగ్గా ఇదే ఫార్ములాను వాడుతున్నట్లు కనిపిస్తోంది. నిజానికి ఆమె ప్రధానంగా ఫైట్ చేయాల్సింది అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో లేదా తన పాత ఓటు బ్యాంక్ కలిగిన బీఆర్ఎస్‌తో. కానీ వారిని వదిలి, ఏపీలో తిరుగులేని పవర్‌తో దూసుకుపోతున్న పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా.. ఏమి సాధిస్తారన్నది ప్రశ్న. కవిత ఎంతగా విమర్శలు గుప్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఉన్న అసలు వాస్తవం ఏమిటంటే తెలంగాణలో జనసేన రాజకీయ ప్రభావం దాదాపు శూన్యం. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని కొన్ని స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, కనీసం డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయింది. అటు ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సక్సెస్ తర్వాత హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన సరికొత్త ఆఫీసును ప్రారంభించినప్పటికీ, అది ఇంకా ఇక్కడ పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా ఎదగలేదు. అంతగా ప్రభావం లేని పార్టీ అధినేతను ఉద్దేశించి రోజూ ప్రెస్ మీట్లు పెట్టడం వల్ల, కవిత తన స్థాయిని తగ్గించుకోవడమే కాకుండా.. అనవసరంగా జనసేనకు ఇక్కడ మైలేజ్ ఇస్తున్నారనే టాక్ వినిపిస్తోందిపవన్ కల్యాణ్ ఏదో అన్నారని, దాని చుట్టూ దేశద్రోహం కేసుల వరకు వెళ్లడం క్షేత్రస్థాయిలో ప్రజలను పెద్దగా ఆకట్టుకోవడం లేదు. తెలంగాణ సమాజం ప్రస్తుతం నిరుద్యోగం, రైతుల రుణమాఫీ, స్థానిక సమస్యలు, కాంగ్రెస్ పాలన వంటి అంశాలపై చర్చించుకుంటోంది. అంతే తప్ప ఏపీ నేత తెలంగాణ గురించి ఏం మాట్లాడారనే అంశంపై సామాన్యులకు పెద్దగా ఆసక్తి లేదు. ఫలితంగా కవిత చేస్తున్న ఈ విమర్శలు సోషల్ మీడియాలో ట్రోల్స్, కౌంటర్ అటాక్స్‌కు పరిమితం అవుతున్నాయి తప్ప.. ఓటర్ల మధ్య ఒక సీరియస్ చర్చకు దారితీయడం లేదు.ఒక కొత్త ప్రాంతీయ పార్టీగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్లాలంటే కేవలం డైవర్షన్ పాలిటిక్స్ లేదా పొరుగు రాష్ట్ర నేతలపై విమర్శలు సరిపోవని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలోని గూడాలలో, పల్లెల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై లేదా స్థానిక సమస్యలపై పోరాడితేనే కవితకు మైలేజ్ వస్తుంది. లేదంటే పవన్‌ను టార్గెట్ చేసే ఈ వ్యూహం కేవలం డిబేట్లకే పరిమితమై, రాజకీయంగా ఆమెకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చకపోవచ్చు.

# వానా కాల్ వచ్చేస్తోంది... వంటా వార్పు ఎలా?



నల్గొండ, జూన్ 28, (వాయిస్ టుడే ) : ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ కిచెన్ షెడ్లు నిర్మించలేదు. దీంతో మండల వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో చెట్ల కింద వంట చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 57 ప్రభుత్వ విద్యాలయాలు ఉండగా అం దులో 4,000 వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన మౌలిక వసతులు అనేక పాఠశాలలో ఇప్పటివరకు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, వంట వండి పెట్టే ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక పాఠశాలల్లో నీటి వసతి లేదని, చాలా చోట్ల కిచెన్ షెడ్లు లేవని , దీనితో పాఠశాలల ఆవరణలో వరండాలు, చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.స్మార్ట్ క్లాస్‌రూమ్స్ గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో, ఇంకా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారుల మధ్యాహ్న భోజనం చెట్ల కిందే వండుతున్నారు. వర్షం వస్తే వంట ఆగిపోతుంది.. పిల్లలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.చాలాచోట్ల నీటి వసతి లేని చోట వ్యవసాయ బావుల నుండి, సమీపంలోని ఇండ్ల నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు వంటకి పెద్దగా ఇబ్బంది లేనప్పటికీ వర్షాకాలంలో తాము వంట చేయడానికి తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి అవసరమైన వంట చెరుకు నిల్వ చేయడం, సామాగ్రి నిలువ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసే జులై, ఆగస్టు నెలలో వంట చేయడం తమకు పెద్ద తంటగా మారిందని వాపోతున్నారు.ఇక అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుతున్న హైస్కూళ్ళు, కొన్ని ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేకపోవడంతో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వందల మంది విద్యార్థులు ఒకేసారి భోజనం చేయడానికి అనువైన వసతి లేక తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణ చెట్ల కింద భోజనం చేస్తున్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో డైనింగ్ హాళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించగా చాలా చోట్ల పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.ఇక ఇదే తరహాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కిచెన్ షెడ్ నిర్మాణం ప్రారంభించినప్పటికీ చాలా చోట్ల నిర్మించలేదు. దీనితో ఈ విద్యా సంవత్సరంలో కూడా పాత పద్ధతిలో చెట్ల కింద వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రతి పాఠశాలలో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మించి, నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.కేసముద్రం మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు లేక మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో వంట సిబ్బంది చెట్ల కింద వంట చేయాల్సి వస్తుండగా, విద్యార్థులు తరగతి గదుల్లో లేదా ఆవరణలో భోజనం చేస్తున్నారు. నీటి వసతి లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది.

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

## తెలంగాణలో త్వరలో బీజేపీ ప్రభుత్వం ఖాయమన్న నితిన్ నబిన్



తెలంగాణలో త్వరలోనే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన శంషాబాద్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనితో పాటు మరో తొమ్మిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కనబరిచిన పోరాట పటిమను తెలంగాణలోనూ పునరావృతం చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలన సాగిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించగా, ఆ ఫలితాన్ని కాంగ్రెస్ తనకనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గల్లీ, మొహల్లాకు పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్' సర్కారు ఉంటేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతకుముందు, శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నితిన్ నబిన్‌కు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల 'విజయ్ సంకల్ప్ సమ్మేళనం'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.



# మలుపులు తిరుగుతున్న మెట్రో

హైదరాబాద్, జూన్ 28, ( వాయిస్ టుడే ) : హైదరాబాద్ లాంటి అంతర్జాతీయ మహానగరానికి ప్రజా రవాణా వ్యవస్థలో గుండెకాయ లాంటి మెట్రో రైలు ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి ప్రభుత్వ పరం కావాల్సిన కీలక తరుణంలో సరికొత్త మలుపులు తిరుగుతోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహిస్తున్న నిర్మాణ దిగ్గజం ఎల్అండ్‌టీ దీని నుండి పూర్తిగా తప్పుకుంది. అయితే, ఎల్అండ్‌టీ నుంచి మెట్రో ఫేజ్-1 టేకోవర్ ప్రక్రియ ఇప్పటికే నత్తనడకన సాగుతుండగా, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తాజా ఢిల్లీ చర్చల తర్వాత రంగంలోకి దేశీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ క్యాప్స్ రావడం ప్రాజెక్టు భవితవ్యంపై తీవ్ర ఆసక్తితో పాటు పలు ఆందోళనలను రేకెత్తిస్తోంది.ఢిల్లీ వేదికగా జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఈ ప్రాజెక్టు వాల్యుయేషన్ బాధ్యతలను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు. ఎల్అండ్‌టీ సంస్థ మెట్రో ప్రాజెక్టు కోసం చేసిన అప్పులు, సేకరించిన నిధులు, రియల్ ఎస్టేట్ ద్వారా వస్తున్న ఆదాయం , ప్రస్తుతం ప్రాజెక్ట్ విలువ ఎంత ఉందనే దానిపై ఎస్‌బీఐ క్యాప్స్ ఒక నిష్పాక్షికమైన నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగానే తెలంగాణ ప్రభుత్వం ఎల్అండ్‌టీకి ఎంత పరిహారం చెల్లించి ప్రాజెక్టును తన చేతుల్లోకి తీసుకోవాలనేది ఖరారవుతుంది. అయితే, ఈ ప్రక్రియ వల్ల మెట్రో సమస్య త్వరగా పరిష్కారమవుతుందా లేదా వాల్యుయేషన్ల లొసుగులతో మరింత కాలయాపన జరిగి మొదటికే వస్తుందా అనే సందిగ్ధత నెలకొందిరోజుకు దాదాపు 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తున్నప్పటికీ హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ఆశించిన స్థాయిలో లాభాలను తీసుకురావడం లేదు. కోవిడ్ లాక్‌డౌన్ దెబ్బ, కా ఐటీ కారిడార్‌లో ఆక్యుపెన్సీ హెచ్చుతగ్గుల వల్ల ఎల్అండ్‌టీ సంస్థ భారీగా నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఇచ్చిన రూ. 3,000 కోట్ల సాఫ్ట్ లోన్ కూడా సంస్థను పూర్తి గట్టెక్కించలేకపోయింది. దీంతో తమ కోర్ బిజినెస్ పైనే దృష్టి పెట్టాలని, మెట్రో లాంటి భారీ రాయితీ ప్రాజెక్టుల నుండి గౌరవప్రదంగా తప్పుకోవాలని ఎల్అండ్‌టీ భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా సింగిల్ హ్యాండ్‌తో టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇందుకు కొన్ని కఠిన నిబంధనలు పెడుతోంది. ఢిల్లీ, బెంగళూరు మెట్రో తరహాలోనే హైదరాబాద్ మెట్రోను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 జాయింట్ వెంచర్ మోడల్‌లోకి మార్చాలని కేంద్రం సూచిస్తోంది. ఈ వ్యూహాత్మక మార్పుకు అంగీకరిస్తే కేంద్రం నుండి నిధుల లభ్యత సులువవుతుంది కానీ, పూర్తి నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లో ఉండదు. ఫేజ్-1 టేకోవర్ వివాదం ఒక కొలిక్కి రాకపోతే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ పనులపై ఆ ప్రభావం పడక తప్పదు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్, నాగోల్-ఎల్బీనగర్ కనెక్టివిటీ, శేరిలింగంపల్లి కారిడార్ల విస్తరణకు వందల కోట్లు అవసరమవుతాయి. పాత లయబిలిటీస్ ఎవరు తీర్చాలనే స్పష్టత లేకపోతే, అంతర్జాతీయ బ్యాంకులైన జైకా , ఏడీబీ ల నుండి కొత్త ప్రాజెక్టులకు రుణాలు రావడం కష్టతరంగా మారుతుంది. ప్రస్తుతానికైతే హైదరాబాద్ మెట్రో భవితవ్యం పూర్తిగా ఎస్‌బీఐ క్యాప్స్ ఇవ్వబోయే ఫైనాన్షియల్ అసెస్‌మెంట్ నివేదికపైనే ఆధారపడి ఉంది. ఎల్అండ్‌టీ ఆశిస్తున్న కమర్షియల్ సెటిల్‌మెంట్‌కు, రాష్ట్ర ప్రభుత్వం భరించగలిగే బడ్జెట్ పరిమితులకు మధ్య ఎస్‌బీఐ క్యాప్స్ ఎలాంటి రాజీ ఫార్ములాను ప్రతిపాదిస్తుందనేది ఇక్కడ అత్యంత కీలకం.

## తెలంగాణలో లిక్కర్ అమ్మకాలలో విస్కీదే టాప్

హైదరాబాద్, జూన్ 28:- తెలంగాణ మద్యం విక్రయాల్లో అత్యధిక - వాటా విస్కీదేనని గణాంకాలు చెబుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో - పోలిస్తే.. తెలంగాణలో మద్యం ప్రియులు.. విస్కీకే ఎక్కువప్రాధాన్యమిస్తున్నారు. ఇక త్వరలోనే తెలంగాణలో మద్యం ధరలు " పెంచేందుకు సర్కార్ ప్రయత్నాలు చేస్తుండటంతో.. విస్కీ లవర్స్కు షాక్ - తప్పదనే వాదనలువినిపిస్తున్నాయి. మద్యం ధరల పెంపు ప్రతిపాదనలతోమందుబాబుల్లో తెలియని ఆందోళన నెలకొంది. తెలంగాణలోని ఏ వైన్స్, ఏ బార్లోకి వెళ్లినా విస్కీ అమ్మకాలే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వేసవి కాలం సందర్భంగా ఎండవేడిమిని తట్టుకునేందుకు మద్యం ప్రియులు.. చల్లని బీర్లు తాగుతున్నా.. విస్కీ అమ్మకాలే అత్యధికంగా ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ మద్యం మార్కెట్లో విస్కీదే సింహభాగం ఉంటుంది. తక్కువ ధర బ్రాండ్ల మద్యం దగ్గరి నుంచి ఖరీదైన బ్రాండ్ల వరకు మందుబాబులు విస్కీకే ఓటేస్తున్నారు. మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో విస్కీ వినియోగం అత్యధికంగా ఉంది. ఇదే సమయంలో.. తొందర్లోనే రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో విస్కీ ప్రియుల జేబుకు చిల్లు తప్పదనే వాదనలు వ్యక్తం అవుతున్నాయి. 2026లో మద్యం మార్కెట్ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో అమ్ముదు అవుతున్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్లోౢా 5 - విస్కీవాటా ఏకంగా 84.89 శాతం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో దేశంలోనే - అత్యంత ఎక్కువ విస్కీ విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచింది. ఇది కర్ణాటకలో 76.50 శాతం, ఆంధ్రప్రదేశ్లో 55 శాతం మాత్రమే ఉంది. మరోవైపు.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బ్రాండీ వినియోగమే ఎక్కువగా ఉండటం గమనార్హం. 3 హైదరాబాద్ లోని బటీ, సర్వీస్ సెక్టార్ ఉద్యోగుల్లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రీజర్ల వాటా 3.32 శాతంగా నమోదైనట్లు గణాంకాలు 3 పేర్కొంటున్నాయి. తెలంగాణలో విస్కీ అంటే కేవలం మద్యం మాత్రమే కాదని.. సామాజిక జీవనంలో ఒక భాగమైపోయిన అలవాటు గా మరిపోయేందని చెప్పవచ్చు. మద్యం ధరలు పెరిగితే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని కుటుంబాలు, రిటైల్ వ్యాపారులు, హాస్పిటాలిటీ రంగంపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో మీడియం, ప్రీమియం విస్కీ బ్రాండ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. మొత్తం విస్కీ అమ్మకాల్లో 45.9 శాతం క్వార్టర్ రూ.170 నుంచి రూ.260 మధ్య ధర కలిగిన బాటిళ్లే ఉండటం గమనార్హం. ఇక రూ.110 ధర కలిగిన క్వార్టర్ల వాటా 22.69 .. . 140-160 6 2 21.07 అమ్మకాలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో రూ.270-రూ.350 ధరల ప్రీమియం విస్కీల వాటా 6.54 శాతం కాగా.. రూ.350 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం బ్రాండ్ల వాటా 3.8 శాతంగా ఉంది. తెలంగాణలో అమ్ముడయ్యే ప్రతీ 10 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో దాదాపు 9 బాటిళ్లు విస్కీయే కావడం విశేషం. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్లో విస్కీ తర్వాత బ్రాందీ నిలిచింది. బ్రాండీ వాటా కేవలం 9.21 శాతం మాత్రమే ఉంది. ఆ తర్వాత వోడ్కా 1.24 శాతం, వైన్ 0.88 శాతం, రమ్ 0.32 శాతం, జిన్ 0.09 శాతం, లిక్యూర్ 0.04 శాతం, టెకిలా కేవలం 0.01 శాతం మాత్రమే వాటాను కలిగి ఉన్నాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో బ్రాందీకి భారీగా డిమాండ్ ఉండేది. అయితే తెలంగాణలో ప్రస్తుతం అది భారీగా తగ్గిపోయింది. బ్రాండీ విభాగంలో కూడా రూ.150 నుంచి రూ.200 మధ్య ధరల ఉత్పత్తులే 63.99 శాతం అమ్మకాలను సాధిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణలో బీర్ అమ్మకాల్లో కూడా కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు స్ట్రాంగ్ బీర్కు ఎక్కువ ఆదరణ ఉండగా.. ప్రస్తుతం లైట్ బీర్ వైపు మందుబాబులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం బీర్ అమ్మకాలలో లైట్ బీర్లు 55.97 శాతం ఉండగా.. 44.03 శాతం స్ట్రాంగ్ బీర్ల వాటా నమోదైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాల వైపు యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
సోమవారం 29 జూన్ 2026



## నాగారం డివిజన్‌లో పల్స్ పోలియో

నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావాలని, ప్రతి చిన్నారికి రెండు చుక్కలు తప్పనిసరిగా ఈరోజు పల్స్ పోలియో కార్యక్రమం వేయాలని పలువురు కోరారు. ఆదివారం నాగారం డివిజన్ పరిధిలోని కరీంగూడ స్కూల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో నాగారం డివిజన్‌కు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అందరూ సహకరించాలని కోరారు. పల్స్ పోలియో ప్రతి చిన్నారికి రెండు చుక్కలు, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు.



## కీసరలో పోలియో చుక్కల కార్యక్రమం

నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): కీసరలో ఆదివారం నిర్వహించిన పోలియో కార్యక్రమం లో కీసర గుట్ట ట్రస్ట్ మాజీ మెంబర్ రాగుల రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామ పంచాయతీ మాజీ వార్డ్ సభ్యులు శీలం మల్లేష్, కీసర మండల సమాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, మాజీ వార్డ్ సభ్యులు చిలుక ప్రవీణ్ లు పాల్గొన్నారు.



## "సర్" కార్యక్రమాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ నారపల్లి ప్రాంతంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ బీఎల్ఓలు, బీఎల్ఏలుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను జాగ్రత్తగా సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు బీఎల్ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌ను పూర్తి వివరాలతో సక్రమంగా నింపి సమర్పించాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు ఈ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగస్వామి కావడం ద్వారా ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందేందుకు సహకరించాలని తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు వేముల మహేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ కృష్ణారెడ్డి, ఏనుగు జలంధర్ రెడ్డి, పోచారం మున్సిపల్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఘట్కేసర్ మండల్ అధ్యక్షులు కర్రే రాజేష్, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, బాబురావుగౌడ్, బూజీ రెడ్డి, కట్ట ఆంజనేయులు గౌడ్, వెంకటేష్ గౌడ్, గణేష్ యాదవ్, రాజు, అంజన్ గౌడ్, వినోద్, బీఎల్ఓలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నాగారం ఓల్డ్ విలేజ్‌లో ఓటర్ల నమోదు పత్రాలు పంపిణీ

### పరిశీలించిన నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): నాగారం డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్, బూత్ నంబర్ 216లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని బీఎల్ఓ అనురాధతో కలిసి నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు తదితర ప్రక్రియలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా కొనసాగుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని, ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్ఓను సంప్రదించి సరిదిద్దుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు ఎన్నికల సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని కోరారు.

# చిన్నారుల ఆరోగ్య రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ఐదేళ్ల లోపు ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయించాలి: నీలం మధు ముదిరాజ్



పటాన్ చేరు (వాయిస్ టుడే): దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్య భద్రతపైనే ఆధారపడి ఉంటుందని, ఐదేళ్ల లోపు ప్రతి బిడ్డకూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తన స్వగ్రామం చిట్కుల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందితో కలిసి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నీలం మధు ముదిరాజ్ మీడియాతో మాట్లాడుతూ, పోలియో మహమ్మారిని దేశం నుంచి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పల్స్ పోలియో కార్యక్రమాలను నిర్వహిస్తోందని గుర్తుచేశారు. తల్లిదండ్రులు ఎలాంటి అశ్రద్ధ లేదా అపోహలకు లోనుకాకుండా తమ పిల్లల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒకప్పుడు దేశాన్ని పట్టిపీడించిన పోలియోను కేవలం నిరంతర చుక్కల మందు పంపిణీ ద్వారానే నియంత్రించగలిగామని, ఆ పట్టుదలను ఇలాగే కొనసాగించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ, ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో విడతలోనూ ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ మళ్లీ చుక్కలు వేయించడం సురక్షితమని, ఇది పిల్లల్లో రోగనిరోధక శక్తిని మరింత పటిష్టం చేస్తుందని ఆయన వివరించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య, ఆరోగ్య రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ఒక్క రికార్డు కూడా మిస్ అవ్వకుండా వంద శాతం పోలియో చుక్కల పంపిణీ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. ఎండలను, వానలను లెక్కచేయకుండా ప్రతి ఇంటికీ తిరుగుతూ వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది సేవలను ఆయన కొనియాడారు. అలాగే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మొబైల్ పోలియో కేంద్రాలను ప్రయాణాల్లో ఉన్నవారు సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి పల్లె, పట్టణాల్లోని చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు స్థానికంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.



## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్

నాగారం, జూన్ 28:- (వాయిస్ టుడే): కాప్రా గాంధీనగర్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ వేసారు. రెండు చుక్కలు మీ చిన్నారుల జీవితానికి శ్రీరామ రక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



## జమ్మిగడ్డలో ఘనంగా పల్స్ పోలియో చుక్కలు వేసిన టీటీడీపీ రాష్ట్ర మాజీ సెక్రటరీ నీరు కొండ సతీష్ బాబు

నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని డా ఏ ఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డ బిజేఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ టీటీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఉప్పల్ ఆడ హక్ కమిటీ మెంబర్ నీరు కొండ సతీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరు కొండ సతీష్ బాబు మాట్లాడుతూ దేశాన్ని పోలియో రహితంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని గుర్తుచేశారు. అవగాహన లోపంతో ఏ ఒక్క చైల్డ్ కూడా చుక్కలు వేసుకోకుండా ఉండిపోకూడదని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు.

సెలవు దినమైనప్పటికీ చిన్నారుల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు మరియు ఆరోగ్య కార్యకర్తల సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడురి గగన్ కుమార్, పెద్దాపురం కుమారస్వామి, నరసింహ చారి, దయాకర్, రవి నాయక్, రవి, స్థానిక కాలనీ వాసులు, ఆశా వర్కర్స్ మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## మాటలు కాదు... చేతలతో చూపించారు



నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): నాగారం--దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై ప్రజలకు నిత్యం ప్రమాదకరంగా మారిన గుంతల సమస్యను గుర్తించి, ప్రజల భద్రత దృష్ట్యా తాత్కాలిక మరమ్మతులు చేపించి ఉపశమనం కల్పించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ గంద్ర కమలాకర్ పటేల్ కి, పీఆర్‌పీ నాయకులు కోడూరి ప్రవీణ్ కుమార్ లకు ఆ ప్రాంతం ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యలను సోషల్ మీడియాలో చర్చించడం మాత్రమే కాదు, క్షేత్రస్థాయిలో స్పందించి చర్యలు తీసుకోవడం నిజమైన ప్రజా నాయకత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వానికి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగే నాయకులకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని అన్నారు.



## చిట్కుల్ వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించిన మునేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

### కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్

పటాన్ చేరు (వాయిస్ టుడే) : శ్రీ మునేశ్వర స్వామి అనుగ్రహంతో గ్రామంలో శాంతి, సుభిక్షం నెలకొని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ దేవాలయం చిట్కుల్ వడ్డెర కాలనీ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు బాబా నిజాముద్దీన్,చందర్ ,చక్రపాణి,భాస్కర్ ,పాల్, ముత్తు, షకీల్, క్రాంతి, సల్మాన్,వినీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లినట్లే..

## పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..

## భానూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ భారీ ర్యాలీ



పటాన్ చేరు (వాయిస్ టుడే) : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ.. ప్రజలకు ఇచ్చిన అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీలో చేరిన గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు ప్రవళిక నరేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరచితలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. అతి త్వరలో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ప్రభుత్వం సహకరించక పోయిన నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని తెలిపారు. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుని ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని.. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, సాగర్, శివయ్య, నాగేష్, మధు, రవి, సత్తయ్య, మాణిక్యం, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

## జనసేన నాయకులు ప్రేమ్ కుమార్




కూకట్‌పల్లి, జూన్ 28(వాయిస్ టుడే): కేపీహెచ్‌బీ కాలనీలోని రోడ్డు నంబర్--1లో గాంధీ విగ్రహం వద్ద ఛత్రపతి ధర్మ రక్షణ సేవ అధ్యక్షులు కర్రా వేణుగోపాల్ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ ర్యాలీ రోడ్డు నంబర్--1 నుంచి రోడ్డు నంబర్--5 వరకు యువతతో కలిసి సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ మాజీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, యువత మత్తుపదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండటంతో పాటు వాటి నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, మత్తు వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం మత్తుపదార్థాల విక్రయాన్ని సమూలంగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను మత్తుపదార్థాలకు దూరంగా ఉంచడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం యోగేష్ ప్రభు, డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ రమేష్, నాగేశ్వర్ గుప్తా జీ. ప్రసాద్, అనిత గాలి యువతకు మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, మండలి అనిల్, రణదీప్, ప్రసాద్ నాయుడు, ప్రవీణ్, ఇతర పార్టీ నాయకులు దీపక్ చౌదరి, హరిబాబు, శ్రావణ్ బత్తుల, కాలనీ వాసులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బోయిన్‌పల్లిలో ఘనంగా శ్రీ శివ దుర్గ ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

కూకట్ పల్లి : జూన్ 28(వాయిస్ టుడే): బోయిన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు దండగుల యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ శివ దుర్గ ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను బండి రమేష్ అభినందిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ యాదవ్, పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, రాజేందర్, శివ, సతీష్, షాహన్నా, రాము పాల్గొన్నారు.



## నిండు జీవితానికి రెండు చుక్కలు

**-- 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి**

**-- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్**

కూకట్‌పల్లి: జూన్ 28(వాయిస్ టుడే) శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పల్స్ పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "0 నుంచి 5 ఏళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. పోలియో రహిత సమాజ నిర్మాణం మనందరి బాధ్యత. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని పోలియో కేంద్రానికి తీసుకెళ్లి రెండు చుక్కలు వేయించాలి" అని పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, నాయకులు రమేష్, రాజేందర్, భద్రయ్య, రామచందర్, సాయి, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసిన లాలాపేట గడి స్కూల్ 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సికింద్రాబాద్, జూన్ 28 (సాక్ష్యం): లాలాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గడి స్కూల్) 1993--94 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి దిశానిర్దేశం చేసిన అప్పటి ఉపాధ్యాయులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. గురువుల సేవలను స్మరించుకుంటూ వారి ఆశీస్సులు పొందడం జీవితంలో మరపురాని ఘట్టమని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.గురువులు నేర్పిన క్రమశిక్షణ, విలువలు, విద్యే తమ విజయాలకు పునాదిగా నిలిచాయని వారు తెలిపారు. ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలు గురు-శిష్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు.అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న తమ శిష్యులను చూసి గర్వంగా ఉందన్నారు. సమాజానికి సేవ చేస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో 1993--94 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు వెంకటేష్ యాదవ్, బాలకృష్ణ, శ్రీనివాస్, యాదవ్, కృష్ణారావు, సత్యనారాయణ, నాగరాజు, ప్రకాష్, మోహన్ చారి, వెంకటేశ్వర్లు, ఎస్. రమేష్, వి. మహేష్, రామ్‌చందర్, రాజేందర్, ఆత్రేయ, బాల్‌రాజ్, నాగేశ్, కృష్ణమూర్తి, బాబురావు, కిషోర్, వెంకట్ రెడ్డి, పవన్, ఎ. మహేష్, ఎన్. కిరణ్ కుమార్, తిరుపతి రెడ్డి, బి.ఎస్. యాదవ్, భీరప్ప, వేణుగోపాల్, మోహన్, వై.బి. శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నగర్ కాలనీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడుగా అబ్దుల్ మజీద్ నియామకం



జూబ్లీహిల్స్ 28 జూన్ (వాయిస్ టుడే ): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. దీపక్ జాన్‌తో సంప్రదింపుల అనంతరం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ అధ్యక్షుల నియామకాలకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు శ్రీనగర్ కాలనీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడుగా అబ్దుల్ మజీద్ తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను కృతజ్ఞతలు తెలిప్యారు..కాంగ్రెస్ పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నానని తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ శ్రీనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరితో కలిసి కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అబ్దుల్ మాజీద్ ను శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో డివిజన్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఆల్విన్ కాలనీ చౌరస్తాలో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహ భూమిపూజ

**కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్**

పటాన్ చేరు (వాయిస్ టుడే): పటాన్ చెరు నియోజకవర్గం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తాలో, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న 12 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, దేశభక్తి, ధైర్యసాహసాలు, స్వరాజ్య స్థాపనకు ప్రతీకగా నిలిచిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆదర్శాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ధర్మరక్షణ, సుశాసనం, మహిళల గౌరవ పరిరక్షణ, ప్రజాహిత పాలనలో శివాజీ మహారాజ్ చూపిన నాయకత్వం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. నేటి తరం యువత శివాజీ మహారాజ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సపన దేవ్, శంకర్ యాదవ్, మెట్టు కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధు, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, మాజీ ఎంపీపీ యాదగిరి, నర్ర బిక్షపతి, వంగారి అశోక్, చందు, కోమరగూడెం వెంకటేష్, మల్లేష్ యాదవ్ శ్రీనివాస్, దినేష్, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శివాజీ అభిమానులు, విగ్రహ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, యువకులు, MPR యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## రాంపల్లి పరిధిలోని ఏడు కాలనీల అసోసియేషన్స్ సమావేశం

నాగారం, జూన్ 28:-(వాయిస్ టుడే): రాంపల్లి పరిధిలోని కాకతీయ డైమండ్ కౌంటీలో ఆదివారం నిర్వహించిన 7 కాలనీల సంక్షేమ సంఘాల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి కాలనీ ప్రతినిధులతో సమావేశమై ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సరఫరా, విద్యుత్ హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్య పెంపు, వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జీవన్ రెడ్డి డైమండ్ కౌంటీ ప్రధాన రహదారికి 35 వీధి దీపాలను విరాళంగా అందజేస్తామని ప్రకటించారు. అలాగే మిగిలిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగారం - రాంపల్లి ఆల్ ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసల్ కాలనీల అసోసియేషన్ అధ్యక్షుడు మాజేటి వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.హెచ్. సాయినాథ్ గౌడ్, ఉపాధ్యక్షుడు సి.హెచ్. దేవి వర ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు, కోశాధికారి టి. రామ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు: రామకృష్ణ, శ్రీనివాస్, హనుమంతరావు, రాఘవరావు, వంశీ, ప్రభు వర్ధన్. ఈ సమావేశంలో కాకతీయ డైమండ్ కౌంటీ, తారక ఎన్‌క్లేవ్, అయ్యప్ప నగర్, శివ సాయి ఎన్‌క్లేవ్, శ్రీ సాయి కాలనీ, సిలికాన్ కాలనీ తదితర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ ప్రాంతాల ప్రజా సమస్యలను వివరించారు.



## భరత్ నగర్ కాలనీలో స్థానిక సమస్యలపై పాదయాత్ర

**- పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమం**

కూకట్‌పల్లి: జూన్ 28(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని భరత్ నగర్ కాలనీలో ఆదివారం ఉదయం కాలనీలోని స్థానిక సమస్యలపై సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్గత రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, శానిటేషన్ వంటి ప్రజా సమస్యలను పరిశీలించడంతో పాటు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ా×=) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా, 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో రెండు చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కమిటీ సభ్యులు నాగేశ్వర్ రావు, మూర్తి బాబు, నరేష్ కుమార్, మధు, వెంకటేష్ యాదవ్, రత్నారావు, భిక్షపతి గౌడ్, బుచ్చిబాబు, డేవిడ్, లక్ష్మి, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్

హైదరాబాద్
సోమవారం 29 జూన్ 2026

# బోరబండలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, 28 జూన్ (వాయిస్ టుడే ): బోరబండ: తెలంగాణ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోరబండ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పోలియో రహిత తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది విస్తృత చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల శాఖ అట్లూరి లక్ష్మణ్ కుమార్,. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్.జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, ఆరోగ్య ఒ కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (చైల్డ్ హెల్త్ ఒ ఇమ్యూనైజేషన్) డాక్టర్ విజయ నిర్మల, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, డాక్టర్ పీటర్సన్, డాక్టర్ జ్యోత్స్నా, డాక్టర్ డేవిడ్, డాక్టర్ మురారి, డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ శ్రీధర్‌తో పాటు ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ధూల్‌పేట్ శ్రీ మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్న పీసీసీ కార్యదర్శి చేపూరి వెంకటేశ్వరరావు

సికింద్రాబాద్ :జూన్28 (వాయిస్ టుడే): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ట్రాజజ) కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ఉపాధ్యక్షులు, సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చేపూరి వెంకటేశ్వరరావు అలనాటి ప్రసిద్ధి ప్రఖ్యాతి గాంచిన ధూల్‌పేట్ శ్రీ శ్రీ శ్రీ మహంకాళీ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వైస్ చైర్మన్ దేపాల వెంకట్‌రావు శాలువాతో చేపూరి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శి చేల్మల్ల మహేష్ కుమార్, కార్యదర్శి బొంబాయి విశ్వనాథ్, సహాయ కోశాధికారి వెంగళ హన్మంతు రావు, దండు పవన్ కుమార్, సభ్యులు దేపాల సత్యనారాయణ, జనగాం పాండు తదితరులు ఆయనకు ఆలయానికి స్వాగతం పలికారు.



## క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి సుధీర్‌ని పరామర్శించిన మధుయాష్కి

ఎల్బీనగర్ జూన్ 28 (వాయిస్ టుడే): వనస్థలిపురం క్రిస్టియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ తవికిటి సుధీర్ ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పరామర్శించారు. సుధీర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ రోజు వనస్థలిపురం గాంధీ నగర్ లోని వారి నివాసానికి వెళ్లిన మధుయాష్కి సుధీర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ అందించేలా చూడడంతో పాటు మళ్లీ చికిత్స కు వెళ్లాల్సిన పరిస్థితిలో మెరుగైన వైద్యం లభించేలా తన వంతుగా సహకారం అందిస్తారని మధుయాష్కీ భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి , బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మకుటం సదాశివుడు , విద్యా రెడ్డి , నారాయణగౌడ్ , ఎస్టీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు రమేష్ నాయక్ , అంతటి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## పద్మారావునగర్‌లో దొంగల బీభత్సం

సికింద్రాబాద్: పద్మారావునగర్‌లో ఆదివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు.మెడికల్ హాలు కార్యాలయంలోకి చొరబడి సెక్యూరిటీ గార్డులను ఆయుధాలతో బెదిరించి రూ.30 వేలు దోచుకెళ్లారు.చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి వివరాల ప్రకారం..పంజాగుట్టకు చెందిన సతీష్‌కుమార్ పద్మారావునగర్‌లో జ్యోతి మెడికల్ హాలు కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రులు, రిటైల్ దుకాణాలకు మందులు సరఫరా చేస్తుంటారు.శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో వ్యాపార లావాదేవీలను ముగించుకుని సిబ్బంది కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ముసుగులు ధరించిన ఎనిమిది మంది దుండగులు ఆయుధాలతో కార్యాలయానికి వచ్చారు.అక్కడ కాపలాగా ఉన్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను కత్తులతో బెదిరించి, వారి సెల్‌ఫోన్లను లాక్కుని మెట్లపై కూర్చోబెట్టారు.అనంతరం గ్యాస్ సిలిండర్, ఇతర ఇనుప పనిముట్లతో కార్యాలయం తాళాలను పగులగొట్టారు. నాలుగో అంతస్తులో ఉన్న క్యాష్ కౌంటర్ నుంచి రూ.27,500 అపహరించారు. ఒక సెక్యూరిటీ గార్డు నుంచి రూ.1500, మరొకరి నుంచి రూ.1000 లాక్కుని వారి ఫోన్లను అక్కడే పడేశారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి పారిపోయారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు డీసీపీ రక్షితా కృష్ణమూర్తి ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి నిందితుల కోసం గాలిస్తున్నారు.

## వంద శాతం లాభాలంటూ.. రూ.37 లక్షల మోసం

రాయదుర్గం, న్యూస్‌టుడే: గుర్తింపు పొందిన స్టాక్ మార్కెట్ ఎనలిస్టులమని, తమ సూచనలతో పెట్టుబడి పెడితే వంద శాతం లాభాలు వస్తాయని ఓ బాధితుడి ద్వారా రూ.37 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టించి మోసగించిన ఘటన తాజాగా వెలుగుచూసింది. సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసుల కథనం ప్రకారం.. గౌలిదొడ్డిలో నివసించే నారాయణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 2022 నుంచి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంటారు. ఫిబ్రవరిలో బిలాల్, మయాంక్ అనే వ్యక్తులు ఆయనకు ఫోన్ చేశారు. తాము సెబీ గుర్తింపు పొందిన ఎనలిస్టలమని పరిచయం చేసుకున్నారు. తమ సూచనలతో పెట్టుబడి పెడితే వంద శాతం లాభాలు వస్తాయన్నారు. వారి మాటలు నమ్మి.. వారు సూచించిన విధంగా స్టాక్ మార్కెట్‌లో రూ.37 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఆ పెట్టుబడులపై భారీగా నష్టం వచ్చి పూర్తిగా డబ్బులు కోల్పోయారు. వారిని సంప్రదించగా తమకు సంబంధం లేదని, స్టాక్ మార్కెట్‌లో నష్టాలకు తాము బాధ్యత వహించమని చెప్పారు. సెబీ గుర్తింపు పేరిట కంపెనీలు ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఈ నెల 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



## ఉషోదయ కాలనీలో పల్స్ పోలియో, ఎస్ఐఆర్ కార్యక్రమాలు విజయవంతం

కుత్బుల్లాపూర్, జున్ 28(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, డేగల సతీష్ బాబు, కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, కార్యకర్తలు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం అదే కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్



ఇంటెన్సివ్ రెవిషన్) ఓటరు నమోదు మరియు సవరణ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, డేగల సతీష్ బాబు, గురు ప్రసాద్ రావు, నారాయణ, రమేష్ బాబు, నరసింహారెడ్డి, సురేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, మార్పులు-- చేర్పులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినయోగించుకుందాం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం

**బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్**



నాచారం (వాయిస్ టుడే);ఓటు హక్కు వినయోగించుకుందాం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ లోని కీమ్తి కాలనీ, గోకుల్ నగర్, సండే మార్కెట్, నాగార్జున నగర్, షిరిడి సాయి నగర్ లలో ఇంటి ఇంటికి తిరుగుతూ బిఎల్ ఓ అఖిల తో కలిసి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అలాగే ఓటరు గుర్తింపు కార్డు వివరాలను పరిశీలించి, కొత్త ఓటరు నమోదుతో పాటు పేర్లు, చిరునామా, ఇతర వివరాల సవరణలు మరియు నవీకరణలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలకు వివరించి, అవసరమైన సహాయాన్ని అందించారు. అదేవిధంగా ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు, తమ వివరాలను సక్రమంగా నవీకరించుకోవాలని మురారి స్మితా కోటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఓటరు నమోదు ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

## ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోండి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 28: ఖైరతాబాద్ డివిజన్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ బడా గణేష్ సమీపంలోని గజ్జలమ్మ ఆలయం పక్కన ఉన్న గజ్జలమ్మ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం గాంధీనగర్ లోని అంగన్వాడీ సెంటర్ ను సందర్శించారు. సెంటర్ లో మౌలిక సదుపాయాలతో పాటు టీవీ, విద్యార్థుల తల్లిదండ్రులతో అంగన్వాడీ టీచర్ల కమ్యూనికేషన్ సదుపాయం కోసం మొబైల్ వంటి సదుపాయాలను కిషన్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, స్థానిక సీనియర్ నాయకులు మానేకర్ చంద్రు బాబా పాల్గొన్నారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయడం అలవర్చుకోవాలని అన్నారు.

## ముషీరాబాద్‌లో చుక్కల మందుకు చక్కటి స్పందన



ముషీరాబాద్, జూన్ 28: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని వైద్యాధికారి డా.మనోజ్ రెడ్డి సూచించారు. సమాజంలో పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యతో పాటు క్రీడలకు పెద్ద పీట



హైదరాబాద్, జూన్ 28: శ్రీ చైతన్య విద్య సంస్థల ఫౌండర్ స్వర్గీయ డాక్టర్ బీ ఎస్ రావు స్మారకార్థం నారాయణగూడ జోన్ లోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడ అవసరం అని క్రీడల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోర్యంగా ఉంటారని జట్టుగా పనిచేసే లక్షణాలు పెరుగుతాయని శ్రీ చైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ బోపన్న, నాగేంద్ర వివరించారు. విద్యార్థులలో క్రీడ స్ఫూర్తిని పెంపొందించడానికి టీమ్ స్పిరిట్ పెంచడానికి ఈ క్రికెట్ విద్యార్థులలో విశ్వాసం పెంపొందిస్తుందని నారాయణగూడ జోన్ ఏజిఎం మొగల్ నూర్ మహమ్మద్ అలీ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేంకటేష్ , కో ఆర్డినేటర్లు పుల్లారావు, రాజేంద్ర ప్రసాద్ , రూబీన, సుధ, షాలెట్ వివిధ బ్రాంచీల ప్రిన్సిపాల్లు, డీన్లు, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ లో హిమాయత్ నగర్, బర్కత్ పుర, మేడిపల్లి, తార్నాక, నాచారం( సి. బి స్ సి ), నాగోల్ (సి. బి స్ సి ), హబ్సిగూడ 2, నల్లకుంట బ్రాంచిల శ్రీ చైతన్య క్రికెట్ క్రీడా విద్యార్థులు పోటీలో పాల్గొని తమ క్రీడా ప్రతిభా పాటవాలను ప్రదర్శించనున్నారు.

# నిండు ప్రాణానికి రెండు చుక్కలు... ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు

**జిల్లాలోని 84,301 మంది చిన్నారులకు పల్స్ పోలియో వ్యాక్సిన్ లక్ష్యం**

**ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ,వాయిస్ టుడే: పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (మిషన్ ఆసుపత్రి)లో వారు సంయుక్తంగా ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "నిండు ప్రాణానికి రెండు చుక్కలు" అనే నినాదంతో జూన్ 28,29,30 తేదీల్లో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 84,301 మంది చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం 460 పోలియో బూత్‌లు,27 మొబైల్ బృందాలు,12 ట్రాన్సిట్ బృందాలు,27 పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయగా, కార్యక్రమ నిర్వహణకు 1,804 మంది సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఆదివారం గ్రామ పంచాయతీలు,అంగన్‌వాడీ కేంద్రాలు,ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు,పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు వ్యాక్సిన్ అందిస్తారని, అనంతరం జూన్ 29, 30 తేదీల్లో మొదటి రోజు వ్యాక్సిన్ తీసుకోలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పోలియో నిర్మూలనలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య శాఖ,ఐసీడీఎస్,అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఏ ఒక్క చిన్నారి కూడా వ్యాక్సిన్‌కు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారామ్ కుమార్,సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్,మాస్ మీడియా అధికారి సుభాష్,ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి,స్టేట్ రెడ్‌క్రాస్ సభ్యులు ఈ.వి శ్రీనివాస్,వైద్య ఆరోగ్యశాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్ (వాయిస్ టుడే) : నియోజకవర్గం లో హత్నూర మండల పరిధిలోని తుర్కల్ ఖానాపూర్ గ్రామంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 2003 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాడు విఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరుపుకున్నారు 10వ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు కొన్ని సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకొని ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు క్షేమాలు అడిగి తెలుసుకున్నారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చదువు చెప్పిన గురువులు క్రమశిక్షణతో నేడు వివిధ స్థాయిలో స్థిరపడి చిన్ననాటి చిలిపి గుర్తులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు అనంతరం భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## పల్స్ పోలియో చుక్కలు వేసిన మంగాపూర్ సర్పంచ్ రాధా రమేష్

నర్సాపూర్ (వాయిస్ టుడే) : నియోజకవర్గంలో హత్నూర మండల పరిధిలోని మంగాపూర్ గ్రామంలో ఆదివారం నాడు ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వైద్య బృందంతో కలిసి పోలియో చుక్కలు వేశారు ఈ సందర్భంగా మంగాపూర్ సర్పంచ్ రాధా రమేష్ మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కల వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వారు తెలిపారుఈ అవకాశాన్ని హత్నూర మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారుతెలిపారు కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దేవేందర్ రెడ్డి వార్డుసభ్యులు గ్రామ పెద్దలు వైద్యాధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు

## బాలు జయంతి సందర్భంగా "బాలు స్వర నీరాజనం" కార్యక్రమం

**దండు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న సినీ గేయ అభిమానులు**



నాగార్జునసాగర్ జూన్ 28 (వాయిస్ టుడే) : శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పైలాన్ పాత బస్టాండ్‌లో ప్రముఖ సినీ గాయకుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని "బాలు స్వర నీరాజనం" సంగీత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ విఘ్నేశ్వర కళాపరిషత్ వ్యవస్థాపకులు దండు నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం పలువురు గాయకులు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన చిరస్మరణీయ గీతాలను ఆలపించి ఆయనకు సంగీత నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాలు అభిమానులు, సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బాలు గాన మాధుర్యాన్ని స్మరించుకుంటూ ఆయన తెలుగు సినీ సంగీతానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగి ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర కళా పరిషత్ వ్యవస్థాపకులు డైరెక్టర్, జూనియర్ ఏఎన్ఆర్, నటులు, గాయకుడు దండు నాగేశ్వరరావు, వెన్నెల క్రాంతి, నాగమణి, సుజాత పేర్లు వద్దు, సుగుణమ్మ, చేబ్రోలు శ్రీనివాస్, ఈటి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ గుర్తింపు పొందిన యువకుడు



రాయికల్ ( వాయిస్ టుడే ): రాయికల్ పట్టణానికి చెందిన ఆర్మూరి శితికంఠ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సాధించారు. ఆస్ట్రేలియాకు చెందిన ప్రతిష్టాత్మక క్రీడా సంస్థ 'ఆస్ట్రేలియన్ స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ అసోసియేషన్ నిర్వహించిన 'లెవెల్-1 స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్'గా అత్యున్నత ప్రతిభ కనబరిచిన సర్టిఫికేషన్ ను ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. క్రీడాకారుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం, మైదానంలో వారి అత్యుత్తమ ప్రదర్శనను మెరుగుపరిచేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చుటకు ఈ కోర్సు దోహదపడుతుంది. ఈ అంతర్జాతీయ గుర్తింపుతో క్లబ్ స్థాయి నుండి ప్రాంతీయ స్థాయి క్రీడాకారుల వరకు సరికొత్త మరియు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు రూపొందించే అర్హతను శితికంఠ సొంతం చేసుకున్నారు.

# సర్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలి

**వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు**

**SIR ప్రక్రియపై కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు**

**పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు**



కాజీపేట,వాయిస్ టుడే: తెలంగాణలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR - Special Intensive Revision) ప్రక్రియను పార్టీ శ్రేణులు సీరియస్‌గా తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కాజీపేట మండలంలోని మడికొండలో గల శ్రీ సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ూ×= ప్రక్రియపై ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ శిబిరంలో హనుమకొండ,వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయుబ్,ఇనగాల వెంకట్రామిరెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది వంటిదని,ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని ఆ హక్కును పరిరక్షించుకోవాలని అన్నారు. SIR ప్రక్రియ గురించి పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ఎన్యూమరేషన్ ప్రక్రియ భాగంగా బీఎల్‌వోలు (BLO) ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. గ్రామంలోని బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ూ×= ప్రక్రియను విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ నాయకులు,కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేయడంతో పాటు వాటిని సక్రమంగా నింపడంలో సహకరించాలని, కొత్త ఓటర్ల నమోదు,పేర్ల సవరణలు, చిరునామా మార్పులు,అవసరమైన సహాయం అందించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు,దివ్యాంగులు,నిరక్షరాస్యులు మరియు స్వయంగా ఫారమ్‌లు నింపలేని వారికి ప్రత్యేక సహకారం అందించి ఎవరూ ఈ ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని సూచించారు. అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితాలోని లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన వ్యక్తి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు,సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉండాలని..ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని తన వివరాలను ధృవీకరించుకోవాలని పిలుపునిచ్చారు. చనిపోయిన వారి పేర్లను,ఒకే వ్యక్తికి వేర్వేరు చోట్ల ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి వాటిని నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా నుంచి తొలగించేలా చొరవ చూపాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా చేపట్టడంలో బీఎల్ఏల పాత్ర కీలకం అన్నారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక యాప్ ను ఆవిష్కరించారు. ఈ యాప్ యొక్క పని తీరును నాయకులను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రు పాషా,టెస్కాబ్ చైర్మెన్ మార్నేని రవీందర్ రావు,పార్లమెంట్ ూ×= ఇంచార్జీ దుద్దిళ్ల శ్రీనివాస్,రాష్ట్ర జనరల్ సెక్రటరీ రవళి రెడ్డి,హన్మకొండ జిల్లా యూత్ అధ్యక్షుడు దిలీప్ రాజ్, నియోజకవర్గ, జిల్లా,మండల, డివిజన్,గ్రామ స్థాయి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్లు అందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలి

**ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 60వ డివిజన్ వడ్డేపల్లి పరిధిలోని 184వ బూత్ లెవల్ ఆఫీసర్ బండి శ్రీలత ఆదివారం వడ్డేపల్లిలోని దాస్యం వినయ్ భాస్కర్ నివాసంలో ఆయనకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్,బీఎల్ఏ విపుల్,బీఎల్ఓ శ్రీలత,బీఆర్ఎస్ నాయకులతో కలిసి పలువురు ఓటర్లకు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అర్హులైన ఓటర్ల నమోదు,మృతులు లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు ఈ ప్రక్రియలో భాగమని తెలిపారు. జూలై 24 వరకు కొనసాగనున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ నియమించిన బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పాల్గొంటున్నారని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను అందజేస్తుండగా వారికి బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని,పూర్తి చేసిన పత్రాలను తిరిగి బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని,ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎస్ఐఆర్ అమలులో లోటుపాట్లు కనిపిస్తున్నాయని, వాటిని అధికారులు వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని దాస్యం వినయ్ భాస్కర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండపాక రఘు,నీలం సుహాస్,నవీన్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## పరకాలలో కాంగ్రెస్ పార్టీకి షాక్..

**గులాబీ వైపు యువత అడుగులు..ప్రభుత్వ వైఫల్యాలపై అసంతృప్తి**

**బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ యువ నాయకులు**

హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: ఎన్నికల ముందు హామీలతో ప్రజలను ఆకట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా చేతులెత్తేసిందనే విమర్శలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రభుత్వ పనితీరుపై విసుగుచెందిన నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పరకాల మండలం వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సిలివేరు భాను,యువ నాయకుడు కన్నం చిరంజీవి ఆదివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ హామీలు గాలికొదిలి,పాలనను గందరగోళంగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆ అసంతృప్తే ఇప్పుడు పార్టీలోని నాయకులను కూడా బయటకు తీసుకొస్తోంది. ప్రజల ఆశలు నెరవేర్చే శక్తి బీఆర్ఎస్‌కే ఉందనే నమ్మకంతో యువత పెద్దఎత్తున గులాబీ జెండా వైపు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



## కాజీపేటలో భారీగా గంజాయి పట్టివేత

**ఇద్దరు నిందితుల అరెస్ట్.. ఆటో స్వాధీనం**

కాజీపేట, వాయిస్ టుడే: కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంగా పోలీసులు 1 కేజీ 400 గ్రాముల ఎండు గంజాయిని విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేటలోని కడిపికొండ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారు ఉపయోగిస్తున్న ఆటోతో పాటు రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు,ఎక్కడికి తరలిస్తున్నారు అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కాజీపేట సీఐ శ్యాంసుందర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 70వేల రూపాయలు ఉండవచ్చునని పోలీసులు అంచన వేస్తున్నారు. గంజాయి రవాణా,విక్రయం,వినియోగం చట్టరీత్యా నేరమని,ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిందితులను పట్టుకున్న వారిలో ఎస్ఐ లు శివకుమార్,మౌనిక ఉన్నారు.

హైదరాబాద్
సోమవారం 29 జూన్ 2026



## ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగలో బిఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటి పర్తి జీవన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతు జీవితం అంత ఆడ మగ అందరూ కాయకష్టం తోని పొలాలు కాయకూరలు ఉత్పత్తి చేయడం వాటిని అమ్ముకుని వారు ఉపాధి పొందుతుంటారు. ప్రభుత్వ పరంగా కల్పించవలిసిన సంక్షేమ కార్యక్రమాలు కల్పింపచేయడానికి కృషి చేయవలసిన బాధ్యత అందరిపై ఉంటుంది. ఒక విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న వారు ముదిరాజ్ సోదరులు ఇటువంటి ముదిరాజ్ సోదరులకు ప్రభుత్వపరంగా విద్యా ఉద్యోగాలలో వారికి ఆశించిన మేరకు అవకాశాలు లభించకపోవడం బాధాకరమని అన్నారు,గతంలో ముదిరాజ్ సోదర వర్గాన్ని బీసీఏలో కలిపినట్టయితే వారికి మెరుగైనటువంటి విద్య ఉపాధి అవకాశాలు లభించబడతాయని భావించి ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా బీసీ ఏ లో కలిపే విధంగా నిర్ణయం చేశారు తదుపరి అది న్యాయస్థానంలో నిలిచిపోవడం అమలుకు నోచుకోలేకపోవడం బాధాకరం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి కేసీఆర్ గారు బలహీన వర్గాల సంక్షేమం కాంక్షించి కులవృత్తులను ప్రోత్సహించే విధంగా ఏ కులవృత్తి అయిన వృత్తిపై వారికే హక్కులు కల్పింప చేయబడే విధంగా ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టడం వారికి తోడ్పడడం గమనిస్తున్నాం. భవిష్యత్తులో సామాజికంగా వెనుకబాటు గురవుతున్నటువంటి బలహీన వర్గాలకు వాళ్లందరికీ వారి కులవృత్తులు ప్రోత్సహింప చేయడం ప్రజా ప్రతినిధుల బాధ్యతగా భావించాలని అని అన్నారు.




## మాదిగ కుంటను దోమల కుంటగా మార్చారు

### రాయికల్ మార్కెట్ వృద్ధికి కృషి చేస్తా

రాయికల్( వాయిస్ టుడే) : రాయికల్ పట్టణంలోని మార్కెట్ వాడలో అంబేద్కర్ మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమాన్‌ను శాసన సభ్యులు సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతు చట్టంలో లొసుగులతో కొందరు మాదిగ కుంట ను దోమల కుంట గా మార్చారు అని కూరగాయల మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తా అని అన్నారు. అనంతరం సంఘ సభ్యులు శాలువాతో పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజెంగి నందయ్య, ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి,పల్లికొండ గంగాధర్,మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు,పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ ఏఎంసి చైర్మెన్ లు రాణి సాయి,గన్నె రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లింగంపల్లి సుభాష్, ఉపాధ్యక్షులు మారంపల్లి లక్ష్మీ నరసయ్య, ప్రధాన కార్యదర్శి దోనకంటి రాజేందర్,కోశాధికారి లింగంపల్లి భూమయ్య,సహ కార్యదర్శులు గంగాధర్,న్యాయవాదులు లింగంపల్లి సురేష్,అల్లే పురుషోత్తం,మచ్చ శేఖర్,నాయకులు బాపురపు నర్సయ్య,కోల శ్రీనివాస్,మ్యకల కాంతారావు,మహేంద్ర బాబు,పాక్స్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి,సర్పంచుల ఫోరం మోహన్,అచ్యుత్ రావు, పడిగెల నరసింహ,కొత్తపెల్లి అరవింద్,సురేష్, భీమన్న,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## నిండు జీవితానికి రెండు చుక్కలు

### సర్పంచ్ వూర ప్రసన్న రాబర్ట్

మాడుగులపల్లి, జూన్ 28 (వాయిస్ టుడే): జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ, పోలియో రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మేలాడుతూ పోలియో అనేది చిన్నారుల జీవితాలను శాశ్వతంగా ప్రభావితం చేసే ప్రమాదకరమైన వ్యాధి. అయితే ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా దేశం విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత. ఆరోగ్యంగా ఉన్న పిల్లలకైనా, ఇప్పటికే పలుమార్లు పోలియో చుక్కలు వేసినా కూడా ప్రతి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పకుండా చుక్కలు వేయించాలి అని అన్నారు. గ్రామంలో ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు అపోహలను నమ్మకుండా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని, రెండు చుక్కలతో జీవితాంతం రక్షణ అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని సర్పంచ్ వూర ప్రసన్న రాబర్ట్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం



### ప్రజలకు అరుదైన వైద్య సేవలు..
### యశోద హాస్పిటల్ నిపుణులచే పరీక్షలు..

### సద్వినియోగం చేసుకోవాలని
### బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి పిలుపు

మక్తల్ జూన్ 28 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్, బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న మక్తల్ పట్టణంలోని నెహ్రూగంజ్ మార్కెట్ యార్డులో నిర్వహించనున్న మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గవినోళ్ల బాలకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.



## కొల్లూరులో పల్స్ పోలియో కార్యక్రమానికి శ్రీకారం..

### చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సర్పంచ్ శివరాజ్

ఝరాసంగం, జూన్ 28 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చింతలగట్టు శివరాజ్ ప్రారంభించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాజ్ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వై. నగేష్, సి.హెచ్. మాణయ్య, చింతలగట్టు ప్రకాష్, మాజీ వార్డు సభ్యులు ఎం. విష్ణు, దప్పూరు జగన్, బేగరి సంగయ్య, ఆశమ్మోల సంగయ్యతో పాటు గ్రామ పెద్దలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ ప్రజలు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

### ఝరాసంగం కాంగ్రెస్ మైనార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ ఇస్రాహుల్ హక్



ఝరాసంగం, జూన్ 28 (వాయిస్ టుడే) : ఝరాసంగంమండలంలోని హనుమాన్ టెంపుల్ పోలియో సెంటర్ ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఝరాసంగం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ ఇస్రాహుల్ హక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "చిన్నారి చిరునవ్వుతో ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు తొలి అడుగు పోలియో చుక్కలే" అని అన్నారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. జననం నుంచి ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సమీప పల్స్ పోలియో కేంద్రానికి పిల్లలను తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ప్రతి ఇంటిలోని చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీహెచ్ దత్తు, సీహెచ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక





సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా జూన్-28 (వాయిస్ టుడే) : సుల్తానాబాద్‌లోని రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల ప్రక్రియను ఏ, బుచ్చిరెడ్డి, అబ్దుల్ ఖాలీక్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించారు. సభ్యులందరి ఏకాభిప్రాయంతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడం విశేషంగా నిలిచింది.ఈ ఎన్నికల్లో క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఏ, రామేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి ప్రకాష్ రావు పెద్దన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం. రవీందర్, గేమ్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా డి రమేష్, ఆర్థిక కార్యదర్శిగా వై శ్రీధర్ బాధ్యతలు చేపట్టనున్నారు.కార్యవర్గ సభ్యులుగా ఎం. రాజేంద్ర ప్రసాద్, డి. దామోదర్ రావు, వీ రామ్మూర్తి, కే. మైసయ్య, ఎం. ప్రవీణ్ కుమార్, వి లక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను క్లబ్ సభ్యులు అభినందిస్తూ, వారి నాయకత్వంలో క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడు ఏ. రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, క్లబ్ సభ్యులకు ఆరోగ్యకరమైన వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అంతేకాకుండా సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంతో పాటు క్లబ్ అభివృద్ధికి సభ్యులందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.సభలో పలువురు సభ్యులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్లబ్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. వార్షిక సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో ముగియగా, సామాజిక సేవ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టినందుకు కృషి చేస్తామని తెలిపారు..

## ఘనంగా మాజీ ప్రధాని పి వి నరసింహరావు జయంతి వేడుకలు

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా జూన్-28 (వాయిస్ టుడే) : సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాన్నాయక్ దామోదర్ రావు ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద భారత మాజీ ప్రధాని, భారతరత్న పి వి నరసింహరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పి.వి. నరసింహరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, దక్షిణ భారతదేశం నుంచి తొలి ప్రధానమంత్రిగా దేశానికి సేవలందించిన పి.వి నరసింహరావు ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన దూరదృష్టి కలిగిన మహానేత అని కొనియాడారు.పదిహేడు భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహుభాషా కోవిదుడిగా, నవోదయ విద్యాలయాల రూపకర్తగా, దేశ ఆర్థిక సంక్షోభ సమయంలో విదేశాల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని తిరిగి తీసుకువచ్చి భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన అపర చాణక్యుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.భారతదేశానికి ఐదేళ్లపాటు ప్రధానమంత్రిగా సేవలందించిన మహనీయుడి జయంతిని ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం గర్వకారణమని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, అమిరి శెట్టి రాయలింగం, పల్ల సురేష్,తిరుపతి, చందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



## అన్నారంలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

మిర్యాలగూడ జూన్ 28 (వాయిస్ టుడే): మిర్యాలగూడ మండలంలోని అన్నారం గ్రామంలోజాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ అరుణ శ్రీనివాస్ రెడ్డి లు ప్రారంభించి ఐదు సంవత్సరాలు లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆశా వర్కర్ బచ్చలకూరి అలివేలు అంగన్వాడి టీచర్ బేబీ సరోజన గ్రామ ప్రజలు పాల్గొన్నారు




## గోగులమూడి వెంకటేశ్వరరావు చిత్రపటానికి ఘన నివాళి

### – ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన గోగులమూడి రాజు

కృష్ణా జిల్లా-గన్నవరం:(వాయిస్ టుడే): ప్రముఖ అంబేద్కర్ వాది, గోగులమూడి విజయ్, సాయిల పెదనాన్న గోగులమూడి వెంకటేశ్వరరావు ఇటీవల స్వర్గస్తులైనారు. వెంకటేశ్వరరావు సంస్కరణ కార్యక్రమం మండలంలోని చిన్న అవుటపల్లిలో ఆదివారం జరిగింది. సంస్కరణ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు పాల్గొని, స్వర్గీయ గోగులమూడు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు సరిహద్దు ఆంథోని, గన్నవరం నియోజకవర్గ యువజన అధ్యక్షులు పోనుగుమాటి ఉదయభాస్కర్, మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## APWJF జిల్లా అధ్యక్షులుగా దొండపాటి ఉదయ కుమార్ ఎన్నిక



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): గన్నవరంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన APWJF, APBJAల 4వ కృష్ణా జిల్లా మహాసభల్లో ఆంధ్రజ్యోతి గన్నవరం ప్రతినిధి దొండపాటి ఉదయ కుమార్ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఉదయ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. సభలో పాల్గొన్న ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేసి, విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## పోలియో రహిత సమాజ నిర్మాణం, ప్రతి ఒక్కరి బాధ్యత

### మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్



హుజూర్ నగర్, జూన్, 28 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని.ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి. ప్రజల్లో పోలియోపై పూర్తి అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆరోగ్య శాఖ చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలిఅని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి బూత్‌లో పోలియో చుక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కచిన్నారి,తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ సతీష్ కుమార్, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు చులవ నాగలక్ష్మి చందు, దగ్గుపాటి కవిత బాబురావు, మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**